క్లుప్తంగా

కార్మికులకు వేతనాలు చెల్లించాలి

దర్శి: పారిశుద్ధ్య కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాలని సీఐటీయూ నియోజకవర్గ కార్యదర్శి తాండవ రంగారావు కోరారు. వేతనాలు చెల్లించాలని కోరుతూ గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. రంగారావు మాట్లాడుతూ మండల అధికారుల చుట్టూ తిరిగి మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఐక్యంగా ఉద్యమాలు చేసి హక్కులు సాధించుకోవాలని సూచించారు. చవలం గంగయ్య, అలూరి ఇస్మాయిల్, దానయ్య, అనోక్ నారాయణ, నాగేశ్వరరావు, పిచ్చయ్య పాల్గొన్నారు.

బొట్లపాలెం బాధితులకు రూ.50 వేల ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న కొండారెడ్డి

దర్శి: మండలంలోని బొట్లపాలెంలో గత నెల 17వ తేదీన దాడికి గురైన అనూరాధ, మౌనికలకు రూ.50 వేల చెక్కును పీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు నుంచి ఇచ్చిన చెక్కును ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్లూరి కొండారెడ్డి అందజేశారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. కర్ణా పుల్లారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా గ్రామోత్సవం

బేస్తవారిపేట: కోటా సత్యమాంబ ఆలయ మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించాలు. గ్రామోత్సవంలో భక్తులు కొబ్బరికాయలు కొట్టి పూజలందుకున్నారు.

అధ్యాపకుడికి ఘన వీడ్కోలు


శ్రీనివాసచార్యులును సన్మానిస్తున్న అధ్యాపకులు

యర్రగొండపాలెం: స్థానిక మోడల్ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ నంద్యాల శ్రీనివాసచార్యులు బదిలీ అయిన సందర్భంగా ఆయనకు గురువారం ఘన వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పిల్లి ప్రదీప్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు శ్రీనివాసచార్యులుకు శాలువా కప్పి సన్మానించారు. ఆ కళాశాల అధ్యాపకులు రామకోటయ్య, శ్రీనివాసరావు, ఝాన్సీ, రహమత్ ఉన్నిసా, తిరుపతయ్య, సుజాత, విజయనాయక్, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

రైల్వే టీసీ, సీఆర్‌పీఎఫ్ ఉద్యోగాలకు ఎంపిక


యాలం సాయికిరణ్

మార్కాపురం టౌన్: సికింద్రాబాద్ రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు విడుదల చేసిన ఫలితాల్లో పట్టణానికి చెందిన యాలం సాయికిరణ్ ఎంపికయ్యారు. సీనియర్ కమర్షియల్ కం టిక్కెట్ క్లర్క్ పోస్టుకు సాయికిరణ్ ఎంపిక కావడంపై తల్లిదండ్రులతోపాటు శిక్షణ ఇచ్చిన నేతాజీ ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ కె.కాశిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అలాగే స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ప్రకటించిన ఫలితాల్లో మార్కాపురం పట్టణానికి చెందిన శిద్దా అనిత, కొర్రా శ్రీరాములు నాయక్ సీఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లుగా ఎంపికైనట్లు కాశిరెడ్డి తెలిపారు.

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ కోతలు

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలోని నాగంబొట్లపాలెం, బొద్దుకూరపాడు, లక్కవరం గ్రామాల సబ్‌స్టేషన్‌ల పరిధిలో మూడో ఫేస్ విద్యుత్ నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ వీరబ్రహ్మం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఆయా గ్రామాల పరిధిలో ఉదయం 10 గంటల నుంచి నాలుగు గంటల వరకు ఈ కోత ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇసుక డంప్ సీజ్

ముండ్లమూరు: మండలంలోని పసుపుగల్లు వద్ద అక్రమంగా ఉన్న ఇసుక డంప్‌ను గురువారం సాయంత్రం తహసీల్దార్ ఎండీ నయీమ్ సీజ్ చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక నిల్వ చేస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు పసుపుగల్లులో ఓ ప్రైవేటు స్థలంలో నిల్వ చేసి ఉన్న ఇసుకను సీజ్ చేశారు. ఆయన వెంట వీఆర్వో సుశీలారాణి ఉన్నారు.

నగదు విషయమై ఇరువర్గాల ఘర్షణ

మార్కాపురం రూరల్: నగదు విషయంలో మార్కాపురం మండలం కొట్టాలపల్లి గ్రామానికి చెందిన కొమర చిన్న వెంకటేశ్వర్లుపై అదే గ్రామానికి చెందిన కొమరా అల్లూరయ్య, ఆయన కుమారులు నగదు విషయమై గురువారం దాడి చేసినట్లు మార్కాపురం రూరల్ పోలీసులు తెలిపారు. గాయపడిన వెంకటేశ్వర్లు మార్కాపురం జిల్లా వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై వెంకటేశ్వరనాయక్ తెలిపారు.

నవధాన్యాల సాగుతో భూమి సారవంతం


దర్శిలో ఎస్సీ రైతులు అందుకున్న కిట్లు


రైతులకు నవధాన్యాల కిట్లు అందజేస్తున్న అధికారులు

తాళ్లూరు (ముండ్లమూరు): నవధాన్యాల సాగుతో నేల సారవంతం అవుతుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బి.సుభాషిణి తెలిపారు. మండలంలోని తూర్పుగంగవరం రైత భరోసా కేంద్రంలో గురువారం సన్న,చిన్నకారు రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు విషపూరిత, రసాయన, పురుగుమందులు లేని ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా ఆరోగ్యకర పంటను పండించవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని గ్రామాల్లో ఒక ఉద్యమంలా చేపట్టాలన్నారు. రైతులకు నవధాన్యాల సాగు, సేంద్రియ కషాయాల తయారీపై అవగాహన కల్పించారు. పశుసంపదను వ్యవసాయంలో ఏకీకృతం చేయడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. వ్యవసాయాధికారి ప్రసాదరావు మాట్లాడుతూ మొక్కజొన్న, కొర్ర సాగులో జీవామృతం వేసి అంతర కృషి చేస్తే కలిగే లాభాలను రైతులకు వివరించారు. అనంతరం ఎస్సీ రైతులకు నవధాన్యాల కిట్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ట్రైనర్ రామయ్య, ప్రకృతి వ్యవసాయ ఇన్‌చార్జ్ నరసింహులు. కోఆర్డినేటర్ నవీన్, ఐసీఆర్పీలు నరేష్, రమేష్ పాల్గొన్నారు.

దర్శి: విషరహిత వ్యవసాయం ప్రకృతి వ్యవసాయంతోనే సాధ్యమని ఏఓ బాలకృష్ణ నాయక్ సూచించారు. మండలంలోని వెంకటాచలం పల్లి ఆర్బీకే పరిధిలోని మూడు గ్రామాల రైతులకు నవధాన్యాలు విత్తనాలు, సీడ్‌టూసీడ్ కిట్లు, డ్రమ్ములు, ప్రకృతి వ్యవసాయ కషాయాలను ఎస్సీ కార్పొరేషన్ ద్వారా గురువారం అందజేశారు. బాలకృష్ణ నాయక్ మాట్లాతూ ఒక్కో రైతుకు రూ.10 వేల విలువైన కిట్లు ఉచితంగా అందించారు. ఎంటీ మేరీ డెటిల్లా, వీఏఏలు సోముల నాయక్, జాన్, మూర్తియ్య, మురళి, వేణుగోపాల్, వెంకట్రావు పాల్గొన్నారు.

వరినారు మడుల్లో జాగ్రత్తలు తీసుకోవాలి


వరి నారు మడులను పరిశీలిస్తున్న అధికారులు

దొనకొండ: వరి సాగు చేసే రైతులు సాగర్ కాలవ ఆయకట్టు కింద, బోర్ల కింద పోసిన వరినారు మడుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ వివరించారు. మండలంలో సుమారు 400 ఎకరాలు వరి సాగు చేస్తున్నట్లు గుర్తు చేశారు. గురువారం చందవరం ఆర్బీకే పరిధిలోని 20-25 రోజుల వయసు గల వరి నారు మడులను పరిశీలించి రైతులకు సూచన, సలహాలందించారు. వరి నాటుకు 72 గంటల ముందు ఎకరా నారు మడికి 500 గ్రాముల కార్బో బొరాన్ 3జీ గుళికలు వేయాలన్నారు. ఎకరాకు రెండు బస్తాల సూపర్ పాస్ఫేట్ వేసి పొలం చదును చేయాలన్నారు. అనంతరం కంబోజిపల్లి గ్రామంలో జరుగుతున్న ఈ పంట నమోదును పరిశీలించారు. ఆయన వెంట గ్రామ వ్యవసాయ సహాయకులు సరేంద్ర గౌడ, విన్నీ బాబు పాల్గొన్నారు.

రైతులు సాంకేతిక పద్ధతులు పాటించాలి


మాట్లాడుతున్న ఆత్మ పీడీ అన్నపూర్ణ

ముండ్లమూరు: రైతులు నారుపోసే సమయంలో నూతన సాంకేతిక పద్ధతులు పాటించడం ద్వారా తెగుళ్ల బారి నుంచి పంటను కాపాడుకోవచ్చని ఆత్మ పీడీ కె. అన్నపూర్ణ తెలిపారు. మండలంలోని పోలవరం రైతు భరోసా కేంద్రంలో రైతులకు నారు సాగు పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులు సాగు చేస్తున్న ప్రధాన పంటలకు సంబంధించిన నూతన సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. పంటలకు ఆశించే తెగుళ్ల, వాటి నివారణ చర్యలపై వివరించారు. దర్శి ఏడీఏ బాలాజీ నాయక్, ఏఓ ఫరూక్ పాల్గొన్నారు.

మిరపలో సస్యరక్షణ చర్యలు పాటించాలి


నందిపాలెంలో మిరప మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు

పొదిలి రూరల్: మండలంలోని నందిపాలెంలో సాగు చేస్తున్న మిరప పంటను గురువారం దర్శి కేవీకే కీటక విభాగ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.జాహ్నవి, పొదిలి ఉద్యానశాఖ అధికారిణి డి.సంధ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు కొన్ని సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం పొదిలి రైతు భరోసా కేంద్రం -3లో మిరప పంటలో సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ.. పొలంలో నాటిన నారులో కుళ్లు తెగులు గమనించినట్లు తెలిపారు. దీని నివారణకు మాంకోజెబ్, కార్బండిజమ్ మిశ్రమం 2.5 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి మొక్క మొదలు తడిసేలా పిచికారీ చేయాలన్నారు. నాటే ముందు ఇమిడాక్లోప్రిడ్ 0.5 మి.లీ మందును లీటరు నీటిలో కలిపి నారు మొక్కలను 30 నిమిషాలపాటు ఉంచి నాటాలన్నరు. అలాగే పొలం చుట్టూ జొన్న లేదా మొక్కజొన్న మొక్కలను రెండు సాళ్లు వేసుకోవడం వలన పక్క పొలాల నుంచి వచ్చే రసం పీల్చే పురుగులను నివారించవచ్చని చెప్పారు. ఎకరాకు 10 టన్నుల పశువుల ఎరువు, 150 కేజీల వేప పిండి, 8 కేజీల గుళికలు వేసుకోవాలని సూచించారు. చివరి దుక్కిలో నాలుగో వంతు నత్రజని, పొటాష్ వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

చంద్రయాన్-3 విజయోత్సవ సంబరాలు


ఇస్రో ఆకారంలో ఏర్పడిన విద్యార్థులు

యర్రగొండపాలెం: చందమామపై చంద్రయాన్-3 దిగ్విజయంగా దిగిన సందర్భంగా గురువారం మండలంలోని వై.కొత్తపల్లి ఎంపీయూపీ స్కూల్లో హెచ్ఎం పి.లాలాజ్యోతి ఆధ్వర్యంలో విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు. కేక్ కట్ చేసి ఒకరికి ఒకరు అభినందనలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈవో పి.ఆంజనేయులు మాట్లాడుతు ఇస్రో శాస్త్రవేత్తల కృషి ఫలితంగా భారతదేశ కీర్తి ప్రతిష్ఠ చంద్రమండలాన్ని తాకిందని అన్నారు. చంద్రుని దక్షిణ ధ్రువంపై విక్రమ్ ల్యాండింగ్ విషేశాలను ఆయన విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు తయారు చేసిన చంద్రయాన్-3 నమూనాకు జాతీయ పతాకాలతో సెల్యూట్ చేశారు.

కొమరోలు: పట్టణంలోని ఎస్‌బీఎస్ఆర్ఎం ఎయిడెడ్ పాఠశాలలో చంద్రయాన్-3 విజయోత్సవం గురువారం నిర్వహించారు. చంద్రుని ఉపరితలంపైకి చంద్రయాన్-3 సేఫ్‌గా ల్యాండ్ కావడంపై పాఠశాల కరస్పాండెంట్ బందుగుల నారాయణరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కరస్పాండెంట్ మాట్లాడుతూ భారతదేశ శాస్త్రవేత్తలు సాధించిన చంద్రయాన్-3 విజయం గురించి వివరించారు. అనంతరం విద్యార్థులతో ఇస్రో అక్షరాల నమూనాతో నిలబడి జయహో భారత్ అంటూ నినాదాలు చేస్తూ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి భారతదేశంపై ఉన్న భక్తిని చాటుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి, రేవతి పాల్గొన్నారు. మండలంలోని రాజుపాలెంలో సర్పంచ్ హటేల్ పీరా ఆధ్వర్యంలో జెడ్పీ ఉన్నత పాఠశాల, కస్తూరిబా గాంధీ పాఠశాల విద్యార్థులతో చంద్రయాన్-3 విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని పురవీధుల్లో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహిస్తూ నినాదాలు చేశారు.


జాతీయ పతాకాలతో విద్యార్థుల సందడి

మార్కాపురంలో బీసీ భవన్ మంజూరుపై హర్షం

- సీఎం, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన బీసీ సంఘాల నాయకులు


కేక్ కట్ చేస్తున్న పీఎల్పీ యాదవ్, బీసీ సంఘ నాయకులు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలో బీసీ భవన్ ఏర్పాటుకు అనుమతి మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, అందుకు సహకరించిన ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డికి వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పిన్నిక లక్ష్మీప్రసాద్ యాదవ్, బీసీ సంఘాల నాయకులు గురువారం కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక


అధ్యక్ష ప్రధానకార్యదర్శులు శ్రీనివాసులు, ఎలీషా

ముండ్లమూరు: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ముండ్లమూరు మండల అధ్యక్ష,కార్యదర్శులుగా తిప్పిశెట్టి శ్రీనివాసులు, జి.ఎలీషాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో గురువారం రాత్రి ఏపీటీఎఫ్ మండల సర్వసభ్య సమావేశం జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దన్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా బి.వెంకటేశ్వర్లు, రాఘవయ్య, శివలక్ష్మి, బాలనాగేశ్వరరావు, కార్యదర్శులుగా భవాని శంకర్, శ్రీనివాసరావు, కాటి అంకమ్మ, వెంకయ్య, ఉదయకుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. ఎన్నికల అధికారిగా సీహెచ్ శివరామకృష్ణ వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి పి. శ్రీనివాసులు, రాష్ట్ర కౌన్సిలర్ శ్రీగిరి పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

గిద్దలూరు రూరల్: ప్రజలకు మెరుగైన తపాల సేవలు అందించడమే లక్ష్యంగా చిత్తశుద్ధితో సిబ్బంది పనిచేయాలని మార్కాపురం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాసులు అన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బిజినెస్ రివ్యూ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పోస్టల్ సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పోస్టల్ ఉద్యోగులపై ఉందన్నారు. ఐపీపీబీ, తపాళా బీమా, చిన్నమొత్తాల పొదుపు వంటి పథకాల వ్యాపారం పెంపొందించాలన్నారు. ఉత్తరాల బట్వాడా విషయంలో సంతృప్తికర సేవలు అందించాలని సూచించారు. గిద్దలూరు పోస్టల్ ఇన్‌స్పెక్టర్ టి.శ్రీనివాస్, ఎల్ఎస్‌జీ పోస్టుమాస్టర్ రంగస్వామిరెడ్డి, తపాల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

త్రిపురాంతకం: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మిరియంపల్లిలో శుక్రవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఎస్.పోలిరెడ్డి తెలిపారు. మిరియంపల్లిలో జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొంటారని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, గృహ సారథులు, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు పాల్గొనాలని పోలిరెడ్డి కోరారు.

మహిళల ఆర్థికాభివృద్ధి అవసరం


మాట్లాడుతున్న ఒంగోలు ఎంపీడీవో పి.అజిత, డీపీఎంలు, సమాఖ్య అధ్యక్షురాలు సంధ్యారాణి

ఒంగోలు రూరల్: మహిళలు ఆర్థికంగా బలోపేతమైతేనే కుటుంబ వ్యవస్థతో పాటు ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందని ఒంగోలు ఎంపీడీవో పి.అజిత అన్నారు. చిన్నగా పొదుపు అలవాటు చేసుకుని క్రమంగా వ్యాపారాల వైపు మళ్లి కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని మరికొంత మందికి ఆర్థిక సాయంతో పాటు ఉపాధి కల్పించడం గ్రూపు సంఘాల లక్ష్యమని ఎంపీడీవో అన్నారు. డీఆర్‌డీఏ డీపీఎం నరసింహారావు మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలు పొదుపు చేసుకుని మరికొంత మందికి ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. డీపీఎం సుబ్బారావు మాట్లాడుతూ రుణాలు పొంది సక్రమంగా బ్యాంకుల్లో తిరికి చెల్లించడం ద్వారా బ్యాంకులో పరపతి పెరుగుతుందని తెలిపారు. సమాఖ్య ఆర్థిక నివేదికలు, ప్రాజెక్ట్ నివేధికలు చదివి వినిపించగా సభ్యులు ఆమోదం తెలిపారు.

ప్రస్తుతం మండల సమాఖ్య మహిళా అధ్యక్షురాలు సంధ్యారాణి కార్యవర్గం పదవీకాలం ముగిసినట్లు ఏపీఎం గోపినాథ్ తెలిపారు. అధ్యక్షురాలిగా పాలేటి ప్రియాంక, ఉపాధ్యక్షురాలిగా నల్లూరి అరుణ, కార్యదర్శిగా బక్కమంతుల రమాదేవి, ఉపకార్యదర్శిగా టంగుటూరి జయలక్ష్మి, కోశాధికారిగా వాకా మల్లీశ్వరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారిచే డీపీఎంలు నరసింహారావు, సుబ్బారావు, ఏపీఎం గోపినాథ్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఒంగోలు ఎంపీడీవో పి.అజితను ఘనంగా సన్మానించారు. ఒంగోలు ఏపీఎం గోపినాథ్, ఎల్‌సీ జి.వెంకటసుబ్బయ్య, సీసీలు ఎస్.చెంచమ్మ, ఎన్‌వీ రమణయ్య, అకౌటెంట్ సామ్రాజ్యం పాల్గొన్నారు.

వడ్డెర సభను విజయవంతం చేయాలి


కరపత్రాలు విడుదల చేస్తున్న వడ్డెర సంఘ నాయకులు

దర్శి: వడ్డెరల ఎస్టీ సాధన కోసం ఒంగోలు పట్టణం అంబేద్కర్ భవన్‌లో ఈ నెల 27వ తేదీ మధ్యాహ్నం బహిరంగ సభ నిర్వహించనున్నట్లు రాష్ట్ర వడ్డెర వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ బత్తుల మల్లికార్జునరావు తెలిపారు. ఈ మేరకు కరపత్రాలను శివారజ నగర్‌లో గురువారం విడుదల చేశారు. మల్లికార్జునరావు మాట్లాడుతూ సభకు ముఖ్య అతిథులుగా జాతీయ అధ్యక్షుడు తన్నీరు ధర్మరాజు, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, వడ్డెర కార్పొరేషన్ చైర్‌పర్సన్ దేవండ్ల రేవతి, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పాల్గొంటారని చెప్పారు. అధిక సంఖ్యలో వడ్డెరలు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. నాయకులు వల్లెపు మురళి, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ విమలారామకృష్ణ, వార్డు కౌన్సిలర్ బత్తుల తిరుపతయ్య, చల్లా రవి, వేముల విజయ్, బత్తుల మాలకొండయ్య, బత్తుల శ్రీనిధ్, మల్లికార్జున్, రాంబాబు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ముగిసిన వెంకయ్య స్వామి ఆరాధన

ఒంగోలు మెట్రో: స్థానిక సంతపేటలోని వెంకయ్య స్వామి ఆలయంలో గురువారం శాస్త్రోక్తంగా అర్చక స్వాములు పూజలు నిర్వహించారు. స్వామి వారి మూలవిరాట్‌కు ఉదయం సుగంధ పరిమళ ద్రవ్యాలతో రుద్రాభిషేకం నిర్వహించారు. స్థానిక భక్తులు అధిక సంఖ్యలో తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. పూజ్య భరద్వాజ మాస్టర్ పుత్రిక ఆడిదం వేదవతి గురు చరిత్ర పారాయణ ప్రవచనం చేశారు. నిర్వాహకులు సాంబశివరావు ఆవుల బ్రహ్మయ్య పర్యవేక్షణలో జరిగింది.


గంపల్లో పొంగళ్లు తీసుకెళ్తున్న మహిళలు

కనకదుర్గమ్మకు పొంగళ్లు

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు పంచాయతీ నాయుడుపేటలో గ్రామ దేవత కనకదుర్గమ్మ తల్లి ఉత్సవం నిర్వహించారు. మహిళలు బోనాలు సమర్పించి పూజలు చేశారు. గ్రామ దేవత అంకాలమ్మతల్లికి పొంగళ్లు పెట్టి పూజలు చేశారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, జాకెట్ సమర్పించి మొక్కులు చెల్లించారు. తొలుత మహిళలు గంపల్లో పొంగళ్లు పెట్టుకుని, కలశంతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. సకాలంలో వర్షాలు పడి, గ్రామం పాడి పంటలతో పచ్చగా ఉండాలని కోరుతూ అమ్మవారి దర్శనం చేసుకున్నారు. సమీపంలోని వనంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

రోడ్డుకూ లేదు రక్షణ


ఆర్అండ్‌బీ రోడ్డు వెంబడి మట్టిని తరలిస్తున్న కబ్జాదారులు

ఈతముక్కల (కొత్తపట్నం): అర్అండ్‌బీ రోడ్డు దెబ్బతినే విధంగా అంచున బంకమట్టిని కబ్జా చేస్తున్నారు. అధికారులు, గ్రామస్తులు వెళ్లి నిలుపదల చేయాలని అడ్డుపడితే లెక్కచేయకుండా ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. సూరారెడ్డిపాలెం-ఈతముక్కల మధ్యలో ఆర్అండ్‌బీ రోడ్డు ఉంది. రోడ్డు అంచున కాలువ ఉంది. ఆ కాలువను లోతుగా చేస్తూ మట్టిని తోలుతున్నారు. వర్షాలు వచ్చినప్పుడు తవ్విన గోతుల్లో ప్రజలు, పశువులు పడే ప్రమాదం ఉందని గ్రామస్తులు వీఆర్వోకు ఫిర్యాదు చేశారు. వీఆర్వో శంకరరావు గురువారం సంఘటన స్థలానికి చేరుకుని మట్టి తీయటం వలన రాబోయే రోజుల్లో రోడ్డు దెబ్బతింటుందని వెంటనే నిలుపదల చేయాలని కోరారు. ఇక్కడ మట్టిని తీయటానికి మీకు అనుమతులు ఎవరు ఇచ్చారని, అనుమతులు తీసుకోకుండా ఎలా తీస్తారని ప్రశ్నించారు. కొద్ది సేపు నిలుపదల చేసి కబ్జాదారులు అధికారులు వెళ్లిన తరవాత యథావిధంగా మట్టిని తరలించారు.